బాధితులకు భరోసా

మేమున్నాం.. ధైర్యంగా ఉండండి

మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రులకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరామర్శ

- కేజీహెచ్‌లో మృతుల కుటుంబాలకు ఓదార్పు
- ఎసెన్షియా కంపెనీలో పర్యటించి ఘటనపై అధికారులతో సమీక్ష
- యాజమాన్యం తీరుపై ఆగ్రహం
- రెండు జిల్లాల్లో సుడిగాలి పర్యటన



మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఎం



క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): విపత్తు జరిగినప్పుడు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుంటారని మరోసారి రుజువు చేశారు. అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా కంపెనీలో భారీ ప్రమాదం సంభవించిన తరువాత అమరావతి నుంచి ఎప్పటికప్పుడు సమీక్షించిన చంద్రబాబు గురువారం ఉదయం విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో పర్యటించారు. సంఘటనా స్థలం సందర్శన కంటే తొలుత బాధితులను పరామర్శించి వారిని ఓదార్చాలని భావించి ఉదయం నుంచి సాయంత్రం వరకు విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో సుడిగాలి పర్యటన చేశారు.

గురువారం ఉదయం విజయవాడ నుంచి విమానంలో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని అక్కడ నుంచి హెలికాప్టర్‌లో కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు వచ్చారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన విశాఖ వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించి వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మెడికవర్‌లో ఏడుగురు క్షతగాత్రులను వారు చికిత్స తీసుకుంటున్న బెడ్‌ల వద్దకు వెళ్లి జరిగిన ఘటన వివరాలు తెలుసుకున్నారు. పూర్తిగా నయం అయ్యేవరకు ఆస్పత్రిలో చికిత్స అందిస్తామని, అందుకు ఖర్చు విషయంలో వెనుకాడేదిలేదని చెబుతూ పక్కనే ఉన్న వైద్యులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అక్కడ నుంచి కోస్టల్ బ్యాటరీకి వెళ్లి హెలికాప్టర్‌లో అచ్యుతాపురం వెళ్లాలని షెడ్యూల్‌లో ఉంది. అయితే మెడికవర్ నుంచి కేజీహెచ్‌కు వెళ్లి మృతుల బంధువులతో మాట్లాడాలని నిర్ణయించి కలెక్టర్‌కు అదే విషయం తెలిపారు. దీంతో సీఎం కేజీహెచ్‌కి రోడ్డుమార్గాన బయలుదేరి వెళ్లారు. బుధవారం ఎసెన్షియా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన వారి భౌతికకాయాలకు పోస్టుమార్టం నిర్వహించే మార్చురీ వద్దకు వెళ్లి మృతుల కుటుంబాలను ఓదార్చారు. ధైర్యంగా ఉండాలని చెప్పి మృతుల కుటుంబాలకు రూ.కోటి వంతున పరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. ఇంకా ప్రభుత్వ పరంగా సహాయం విషయంపై కూడా ఆలోచన చేస్తున్నామని వారికి చెప్పి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కోటవురట్ల మండలం కైలాసపట్నం అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను చంద్రబాబు పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. అక్కడ నుంచి తిరిగి కోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్‌కు చేరుకుని హెలికాప్టర్‌లో అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం జరిగిన కర్మాగారాన్ని సందర్శించారు. తరువాత అదే ప్రాంతంలో ఉన్న లారస్ ల్యాబ్‌లో సెమినార్ హాలులో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కర్మాగార యాజమాన్యం తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. సాధారణంగా పారిశ్రామికవేత్తలతో స్నేహపూర్వకంగా ఉంటూ మరిన్ని పెట్టుబడుల కోసం ప్రయత్నించే చంద్రబాబు ఎసెన్షియా కంపెనీ యాజమానుల మధ్య వివాదాన్ని ప్రస్తావించారు. అచ్యుతాపురం సెజ్‌లో అత్యంత తీవ్రమైన ప్రమాదం జరిగి 17 మంది చనిపోయి, 62 మంది గాయపడితే కర్మాగారం పెట్టిన ప్రమోటర్ ఘటనా స్థలానికి రావడం ప్రాథమిక బాధ్యత అని సీఎం ఒకింత తీవ్ర స్వరంతో వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో పరిశ్రమలు రావాలని కోరుకునే వ్యక్తిని... ఇంకా పారిశ్రామికవేత్తలను గౌరవిస్తాం... అని చెప్పారు. తరువాత అక్కడ నుంచి తిరిగి హెలికాప్టర్‌లో విశాఖ విమానాశ్రయానికి చేరుకుని గన్నవరం బయలుదేరి వెళ్లారు.



కేజీహెచ్‌లో మృతుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

తడి ఆరని కన్నులు

- ప్రమాద మృతుల కుటుంబాల్లో ఒకొక్కరిదీ ఒక్కో వ్యథ
- ఒక్క జీతమూ తీసుకోలేదంటూ ఓ తల్లి ఆవేదన
- ప్రేమించి పెళ్లి చేసుకున్న నాలుగు నెలలకే భర్తను కోల్పోయిన యువతి
- ఇంటి నిర్మాణం ప్రారంభించిన మూడు నెలలకే అశువులు బాసిన కుమారుడు
- అత్యవసరంగా రావాలంటూ ఫోన్ చేయడంతో విధుల్లోకి వెళ్లి ప్రాణాలు కోల్పోయిన మరో యువకుడు

- వివరాలు మెయిన్ 11లో



కేజీహెచ్ మార్చురీ వద్ద రోదిస్తున్న మృతుని కుటుంబీకులు

రెండేళ్ల క్రితమే హెచ్చరించినా!

- భారీ ప్రమాదం జరిగినా జాడలేని యజమానులు
- పట్టించుకోని ఎసెన్షియా కర్మాగార యాజమాన్యం



ప్రమాదం జరిగిన ఎసెన్షియా కంపెనీని పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కర్మాగార యాజమాన్యం నిర్లక్ష్యమే కొంపముచ్చింది. కర్మాగారంలో బుధవారం మధ్యాహ్నం జరిగిన భారీ ప్రమాదంలో ఏకంగా 17 మంది ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి. కర్మాగారంలో పైపులు ఎప్పటికప్పుడు పరిక్షించి లీకులు అరికట్టాలని రెండేళ్ల క్రితం అధికారులు హెచ్చరించారు. అంతేకాకుండా కర్మాగారంలో అనేక లోపాలను గుర్తించిన అధికారులు తక్షణమే చర్యలకు ఉపక్రమించాలని చెప్పిన ఆదేశాలు పాటించి ఉంటే బుధవారం ఘోర ప్రమాదం జరిగి ఉండేదికాదని పరిశ్రమల నిపుణులు గుర్తుచేస్తున్నారు.

రెడ్ కేటగిరీలో ఉన్న ఎసెన్షియా అడ్వాన్స్‌డ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌ను 2022లో భద్రతా ఆడిట్ జరిగినపుడు పలు లోపాలు గుర్తించారు. తక్షణమే లోపాలు సవరించడంతోపాటు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాలని కర్మాగార విభాగం సంబంధిత యాజమాన్యానికి ఆదేశించింది. కర్మాగారంలో పలు విభాగాలలో సుమారు 100 అంశాలను ప్రస్తావించి దీని ప్రకారం నివారణ చర్యలు చేపట్టాలని సూచించింది. ఈ అంశాలలో రెండు, మూడు అంశాలు కేవలం పైపులు లీకులకు సంబంధించివే. పీరియాడికల్‌గా పైపులు తనిఖీచేసి లీకులు ఉంటే వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేయాలని స్పష్టంచేసింది. ఘోరమైన విషయం ఏమిటంటే... రియాక్టర్ నుంచి సాల్వెంట్‌ను పంపుతున్న పైపులు లీకై కింద ఫ్లోర్‌లోని ఎలక్ట్రికల్ ప్యానళ్లపై పడి ఆవిరిమేఘంగా మారి బయటకు వెళ్లే మార్గం లేకపోవడంతో ఒత్తిడికి గురికావడం, అదే సమయంలో స్పార్క్ వచ్చి పెద్ద పేలుడు సంభవించింది. చివరకు భారీ పేలుడుకు 17మంది చనిపోయారు. పైపుల లీకులు, పీరియాడికల్‌గా తనిఖీలు చేసి ఉంటే ప్రాణాలు కాపాడే అవకాశం ఉండేదని కొందరు అధికారులు గుర్తుచేస్తున్నారు. ఇదిలావుండగా కర్మాగారంలో భారీ ప్రమాదం జరిగినా కంపెనీ యాజమాన్యం జాడ లేకపోవం గమనార్హం. మృతుల కుటుంబాలు, గాయపడిన వారికి పరిహారం కోసం సొమ్మును కంపెనీ ప్రతినిధి ఒకరు జిల్లా యంత్రాంగానికి అందజేశారు తప్ప యజమానులు రాలేదు.

కంపెనీ అమ్మకాల్లో సంస్థ వ్యవస్థాపక యజమాని పెండ్రి కిరణ్ రెడ్డికి తరువాత వాటాలు కొనుగోలుచేసిన దక్కన్ కెమికల్స్ యజమాన్యానికి గొడవలున్నాయి. ముఖ్యమంత్రి స్వయంగా సమీక్ష చేసి, కర్మాగారం తనిఖీచేసినా ఇద్దరు యజమానులు రాలేదు. ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు విలేకరుల సమావేశంలో వెల్లడించారు. యజమానులకు కోట్ల లాభాలు తెచ్చిపెట్టిన ఉద్యోగులు, నిపుణుల ప్రాణాలు గాలిలో కలిసిపోయాయి తప్ప యజమానులు మారలేదని ప్రమాదంలో మృతి చెందిన ఒకరి బంధువు ఆగ్రహం వ్యక్తం చేశారు.

నైపుణ్యంతో పని లేదా?

- తక్కువ జీతానికి అనుభవం లేనివారితో పనులు
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కాంట్రాక్ట్ కార్మికులు నిద్ర లేకుండా విధులు
- విశ్రాంతి లేకపోవడంతో ప్రమాదాలు



ఎసెన్షియా కంపెనీ గేటు వద్ద గుమిగూడిన జనం

అచ్యుతాపురం, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీ యాజమాన్యం తక్కువ జీతానికి వస్తున్నారనే ఉద్దేశంతో నైపుణ్యం, అనుభవం లేని వారితో పనులు చేయిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక నిపుణుడి వద్ద పనిచేసిన పలువురిని తక్కువ జీతానికి తీసుకుని యంత్రాల వద్ద పనులు ... మిగతా 7వ పేజీలో

ఇసుక అక్రమాలపై క్రిమినల్ చర్యలు

కలెక్టర్ దినేశ్‌కుమార్ హెచ్చరిక

- అందుబాటులో 1 లక్ష 65 వేల టన్నుల ఇసుక
- టన్ను ఇసుక లోడింగ్ ఖర్చు రూ.300
- రవాణా ఖర్చులు లబ్ధిదారులే భరించాలి
- ఇసుకపై ఫిర్యాదులకు టోల్ ఫ్రీ నంబర్లు రాష్ట్ర స్థాయిలో 18005994599, జిల్లా స్థాయిలో 18004256061



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్, పక్కన ఎస్పీ అమిత్‌బర్దార్

పాడేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇసుకను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నదని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ ఉచిత ఇసుక విధానంపై జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్‌తో కలిసి కలెక్టర్ కలెక్టరేట్‌లో విలేకర్లతో మాట్లాడారు. జిల్లాలోని ఎటపాక మండలం గుండాల ప్రాంతంలో రెండు రీచ్‌ల్లో 1 లక్ష 65 వేల 557 టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. లబ్ధిదారులకు ప్రభుత్వం ఇసుకను ఉచితంగానే ఇస్తుందని, టన్ను ఇసుక లోడింగ్ రూ.300 మాత్రమే చెల్లించాలన్నారు. రవాణా ఖర్చులు లబ్ధిదారులే భరించాలన్నారు. ఉచిత ఇసుక పంపిణీలో అదనపు ధరలు వసూళ్లు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే ఇసుకను పొందేందుకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సచివాలయంలోనే బుకింగ్ చేసుకుని, డిజిటల్ విధానంలో సొమ్ము చెల్లించవచ్చునన్నారు. ఎవరికీ ఎటువంటి అదనపు ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. రశీదు మేరకు మాత్రమే నగదు చెల్లించాలన్నారు. అలాగే ఇసుక రవాణాకు వినియోగించే వాహనాలను విధిగా జిల్లా రవాణా అధికారి కార్యాలయంలో రిజిస్టర్ చేయించుకుని అనుమతి పొందాలన్నారు. అలాగే ఉచిత ఇసుక సరఫరా నేపథ్యంలో ఎటువంటి అక్రమాలు, ఇబ్బందులు ఏర్పడినా ప్రజలు నేరుగా టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారం అందించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో నంబర్ 18005994599, జిల్లా స్థాయిలో నంబర్ 18004256061కు ఫోన్ చేయాలని కలెక్టర్ సూచించారు. అలాగే ఉచిత ఇసుక వ్యవహారాలను పర్యవేక్షించేందుకు జాయింట్ కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించినట్టు చెప్పారు. అందిన ఫిర్యాదులను 24 గంటల్లో పరిష్కరిస్తామన్నారు. ఇసుక రవాణా వాహనాలు జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారి కార్యాలయంలో నమోదు చేసుకుని విధిగా యూనిక్ ఐడి నంబరు పొందాలన్నారు. అలాగే ఉచిత ఇసుక సరఫరాపై కొత్త విధానం వచ్చేనెల 11వ తేదీ నుంచి అమల్లోకి ... మిగతా 8వ పేజీలో

గొంతువాపుతో ఇంటర్ విద్యార్థి మృతి



పాంగి జాన్ (ఫైల్)

పాడేరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): గొంతువాపుతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఇంటర్ విద్యార్థి గురువారం మృతి చెందాడు. పెదబయలు గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి పాంగి జాన్(16)కు ఈనెల 12న గొంతువాపు వచ్చింది. దీంతో కళాశాల యాజమాన్యం తల్లిదండ్రులను పిలిపించి విద్యార్థిని అప్పగించారు. గ్రామంలో వైద్యం చేయించిన తల్లిదండ్రులు నయం కాకపోవడంతో రెండు రోజుల క్రితం పాడేరు జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం విద్యార్థి పాంగి జాన్ మృతి చెందాడు. గొంతులో క్యాన్సర్ తరహా కాయ ఏర్పడడం వల్లే విద్యార్థి మృతి చెందాడని భావిస్తున్నారు.



పాడేరు ఆస్పత్రి నుంచి ఇళ్లకు బయలుదేరుతున్న విద్యార్థులు

పాడేరు ఆస్పత్రి నుంచి 8 మంది విద్యార్థులు డిశ్చార్జ్

పాడేరు, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కైలాసపట్నం ఘటనలో అస్వస్థతకు గురై స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న ఎనిమిది మంది గిరిజన విద్యార్థులు గురువారం డిశ్చార్జ్ అయ్యారు. కైలాసపట్నం ఘటనలో బాధితులైన సీదరి సాయి, పాంగి కవిత, పాంగి జస్వంత్, పాంగి అభిషేక్, కొర్రా పవిత్ర, కిల్లో యశ్వంత్, కిల్లో సంజయ్‌తేజ, పాంగి వంశీ అనే విద్యార్థులు స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొంది పూర్తిగా కోలుకున్నారు. దీంతో వారిని గురువారం డిశ్చార్జ్ చేసి ప్రత్యేక వాహనంలో వారిని స్వగ్రామాలకు తరలించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, వైద్యులు, రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు జగన్ అనకాపల్లి రాక



కొత్తూరు, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారిని పరామర్శించేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి శుక్రవారం అనకాపల్లి రానున్నారు. ఆయన ఉదయం గన్నవరం నుంచి విమానంలో 10 గంటలకు విశాఖ విమానాశ్రయానికి చేరుకుంటారు. 10.20 గంటలకు బయలుదేరి రోడ్డు మార్గంలో అనకాపల్లిలోని ఉషాప్రైమ్ ఆస్పత్రికి 11.20కి చేరుకుంటారు. అక్కడ మధ్యాహ్నం 12.20 వరకు క్షతగాత్రులను పరామర్శించి తిరిగి విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు విమానంలో బెంగళూరు వెళతారు.

రెండు బైక్‌లు ఢీ : ఇద్దరి మృతి

- మరో ఇద్దరికి గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన యువకులు



జన్ని మనస్సే (ఫైల్)



సురేంద్ర నాయక్ (ఫైల్)

అరకులోయ, ఆగస్టు 22: అరకులోయ-లోతేరు రోడ్డులోని నాంది ఫౌండేషన్ పల్పింగ్ సెంటర్‌కు సమీపంలో గురువారం మధ్యాహ్నం రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరు మృతి చెందగా.. మరో ఇద్దరు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పెదలబుడు గ్రామంలో గురువారం శుభకార్యం జరుగుతోంది. పెదలబుడుకు చెందిన జన్ని మనస్సే(17) అరకులోయకు పని మీద బైక్‌పై వస్తుండగా.. అదే శుభకార్యానికి అరకులోయ నుంచి పెదలబుడుకు చొంపి గ్రామానికి చెందిన దేవసురేంద్రనాయక్ (22)మరో ఇద్దరు యువకులతో బైక్ వెళుతున్నారు. నాంది ఫౌండేషన్ పల్పింగ్ సెంటర్ సమీపంలోకి వచ్చేసరికి రెండు బైక్‌లు బలంగా ఢీకొన్నాయి. దీంతో ఘటనా స్థలంలోనే మనస్సే, దేవసురేంద్రనాయక్ మృతి చెందారు. ఇదే ప్రమాదంలో చొంపి గ్రామానికి చెందిన దళపతి సిద్ధు(20), పెలమల ధనూష్ గాయపడ్డారు. వీరిని 108లో అరకులోయ ఏరియా ఆస్పత్రి తరలించి, వైద్య సేవలందించారు. మృతిచెందిన మనస్సే ఇంట్లోనే శుభకార్యం జరుగుతోంది. అతి వేగమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది. విషయం తెలిసిన వెంటనే ఎస్ఐ. ఆర్.సంతోష్‌కుమార్, ఏఎస్ఐ, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

బాధితులకు ఓదార్పు


బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు


ఎసెన్షియా ఫార్మా కంపెనీని పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు


ప్రమాదం జరిగిన ఎసెన్షియా ఫార్మా కంపెనీ

అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో క్షతగాత్రులను, మృతుల కుటుంబాలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పరామర్శించారు. విశాఖలోని మెడికవర్ ఆస్పత్రి, కేజీహెచ్‌లను సందర్శించి బాధిత కుటుంబాలతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. అనంతరం ఎసెన్షియా కంపెనీని సందర్శించి ప్రమాదం జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు.


ఎసెన్షియా ఫార్మా కంపెనీని సందర్శిస్తున్న చంద్రబాబు


కంపెనీ గేటు వద్ద బాధిత కుటుంబాల పడిగాపులు


హెల్త్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబుతో మాట్లాడుతున్న సీఎం


మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న సీఎం



ఎసెన్షియా ఫార్మా కంపెనీ వద్ద గుమిగూడిన బాధిత కుటుంబాలు



చిన్నారులకు పరామర్శ

▸▸ **కోలుకునే వరకూ వైద్య సేవలు... డిశ్చార్జ్ సమయంలో 50 వేలు సాయం**

విశాఖపట్నం, ఆగస్టు 22(ఆంధ్రజ్యోతి): కోటవురట్ల మండలం కైలాస పట్నం ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని తీవ్ర అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న చిన్నారులను సీఎం చంద్రబాబు గురువారం పరామర్శించారు. ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో మృతి చెందిన కుటుంబసభ్యులను పరామర్శించేందుకు కేజీహెచ్ మార్చురీ వద్దకు వచ్చిన ఆయన.. అనంతరం ఆస్పత్రిలోని పిడియాట్రిక్ విభాగంలో చికిత్స పొందుతున్న చిన్నారుల వద్దకు వెళ్లారు. ప్రతి చిన్నారినీ పలకరించారు. వారి తల్లిదండ్రులతోనూ మాట్లాడిన సీఎం వైద్య సేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ... 'అందరూ కోలుకునే వరకు వైద్య సేవలు అందిస్తాం. భయపడాల్సిన పనిలేదు. అవసరమైతే ప్రైవేటు ఆస్పత్రులకు తరలించాలని సూచించాం. పిల్లలను డిశ్చార్జ్ చేసే సమయంలో రూ.50 వేలు చొప్పున అందించి పంపించాలని జిల్లా అధికారులను ఆదేశించాం' అని తెలిపారు. సీఎంతో పాటు ఎంపీ శ్రీ భరత్, ఎమ్మెల్యేలు ఉన్నారు.





ఆస్పత్రుల్లో క్షతగాత్రులు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో సంభవించిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఏడుగురికి విశాఖ వెంకోజీపాలెంలోని మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స చేస్తుండగా వారి బంధువులు అధిక సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. క్షతగాత్రులను పరామర్శించేందుకు సీఎం చంద్రబాబునాయుడు గురువారం రావడంతో బంధువులను ఆస్పత్రిలోని నాలుగో అంతస్థులో ఐసీయూ పక్కన హాలులో ఉంచారు. అనకాపల్లి, విజయనగరం, విశాఖ నగరంలో పలు ప్రాంతాల నుంచి ఎక్కువ మంది ఆస్పత్రికి చేరుకున్నారు. గాయపడి చికిత్స పొందుతున్న తమ వారిని చూసేందుకు పడిగాపులు కాశారు.

మెడికవర్‌లో క్షతగాత్రుల వివరాలు

మెడికవర్‌లో చికిత్స కోసం ఏడుగురు చేరారు. వారిలో కె.రాంబాబు(శ్రీకాకుళం జిల్లా సుభద్రాపురం), వై.మహేశ్‌బాబు(మునగపాక మండలం మారేపల్లి), పి.జగదీశ్వరరావు(విజయనగరం జిల్లా ఎల్.కోట), కలిసెట్టి చంద్రశేఖరరావు(విజయనగరం), పక్కి దేముడు(నక్కపల్లి మండలం బోయపాడు), కొండాల నారాయణరావు(శ్రీకాకుళం జిల్లా సారవకోట), భూపతి వెంకటరత్నం(రాంబిల్లి మండలం పెద్ద కల్లేపల్లి)ఉన్నారు.

కిమ్స్ ఐకాన్, ఆర్కే ఆస్పత్రుల్లో..

షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో డి.శ్రీనివాసవర్మ, జీఎస్ వరప్రసాదరాజు, పి.అరుణ్‌కుమార్, గాజువాకలో ఆర్కే ఆస్పత్రిలో జి.చైతన్య చికిత్స పొందుతున్నారు.

వెన్నెలపాలెంలో విషాదం

▸▸ **ఎసెన్షియా ఉద్యోగి రామచంద్రరావు మృతితో కన్నీరుమున్నీరు**


విలపిస్తున్న నాగేశ్వర రామచంద్రరావు కుటుంబ సభ్యులు

పరవాడ, ఆగస్టు 22 : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియాలో జరిగిన ప్రమాదంలో వెన్నెలపాలేనికి చెందిన బొడ్డు నాగేశ్వర రామచంద్రరావు(46) మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది. రామచంద్రరావు గత రెండున్నరేళ్లగా ఆ పరిశ్రమలో అసిస్టెంట్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం జనరల్ షిఫ్టుకు వెళ్లారు. ఉదయం 11 గంటల సమయంలో భార్యతో ఫోన్‌లో మాట్లాడారు. మధ్యాహ్నం రెండు గంటలకు జరిగిన ప్రమాదంలో ఆయన మృతి చెందారు. చినగంట్యాడలోని ఓ అపార్టుమెంట్‌లో కుటుంబసభ్యులతో ఉంటూ విధులకు హాజరయ్యేవారు. స్వగ్రామం వెన్నెలపాలెం అయినప్పటికీ ఉద్యోగరీత్యా అక్కడ ఉండేవారు. కాగా ఈ ప్రమాదంలో రామచంద్రరావు మృతదేహం పూర్తిగా ఛిద్రమైంది. అనకాపల్లి ఎన్టీఆర్ వైద్యాలయంలో గురువారం పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతదేహానికి స్వగ్రామమైన వెన్నెలపాలెంలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య కనకమహాలక్ష్మి, కుమార్తె ఆశ్రిత, కుమారుడు నిహాల్ ఉన్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	98.00
లైవ్ ధర	118.00
విత్ స్కిన్	206.00
స్కిన్ లెస్	216.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509

క్షతగాత్రులకు స్పీకర్ పరామర్శ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22: అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం సెజ్‌లోని 'ఎసెన్షియా' కర్మాగారంలో జరిగిన ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురై అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను గురువారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని డాక్టర్ అవినాష్‌ను అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాలా ఆదుకుంటామని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. పరిశ్రమల్లో మూడు నెలలకు ఒకసారి ఆడిట్ జరగాలని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా సేఫ్టీ మెథడ్స్‌పై ప్రత్యేక దృష్టి సారించి, నిబంధనలు పక్కాగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ తదితరులున్నారు.


క్షతగాత్రులను పరామర్శిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, ఎంపీ రమేష్

వివరాల సేకరణలో అధికారులు


మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న అసిస్టెంట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు

విశాఖపట్నం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): అచ్యుతాపురం సెజ్‌లో ఎసెన్షియా ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుల నుంచి అసిస్టెంట్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ చిన్నారావు వివరాలు సేకరించారు. పేలుడికి కర్మాగారంలోని రియాక్టర్ నుంచి కిందకు పంపింగ్ చేస్తున్న సాల్వెంట్ పైపు లీకై గ్రౌండ్ ఫ్లోర్‌లో ఎలక్ట్రికల్ ప్యానల్స్‌పై పడడంతో గది మొత్తం ఆవిరి మేఘాలు ఏర్పడి కేబుల్ డక్ట్ నుంచి ఆ ఆవిరి గ్రౌండ్ ఫ్లోర్ మొత్తం వ్యాపించిందని ఉద్యోగులు వివరించారు. ఆ సమయంలో ఒక్కసారిగా పెద్ద శబ్దంతో భారీ పేలుడు సంభవించిందన్నారు. ఈ దుర్ఘటనతో కొందరు ఇంకా షాక్‌లో ఉండగా, మరికొందరు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం సంభవించాక ప్రభుత్వానికి పంపిన ప్రాథమిక నివేదికలో పేర్కొన్న విధంగా గాయపడిన క్షతగాత్రులు అక్కడ జరిగిన ఘటనను వివరించారు.

క్షతగాత్రులకు పరామర్శ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లో జరిగిన ప్రమాదంలో గాయపడి స్థానిక ఉషాప్రైమ్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ గురువారం పరామర్శించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవల గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ ఫార్మాసిటీలో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి క్షతగాత్రులను పరామర్శించేందుకు అనకాపల్లి ఉషాప్రైమ్ ఆస్పత్రికి హాజరుకానున్నారని తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఘటన జరిగితే మంత్రులు, అధికార పార్టీ నాయకులు పట్టించుకోలేదని ఆరోపించారు. క్షతగాత్రులను పరామర్శించిన వారిలో మాజీ మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మాజీ ఎంపీ డాక్టర్ బీవీ సత్యవతి, వైసీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు మందపాటి జానకిరామరాజు ఉన్నారు.


క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ బొత్స

సీఎంతో లారస్ ప్రతినిధుల భేటీ

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం అచ్యుతాపురం సెజ్‌లో ప్రమాదం జరిగిన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా లారస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు సి.ఎస్.రావు, రామకృష్ణ చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు.

\- అనకాపల్లి/ఆంధ్రజ్యోతి



'ఎసెన్షియా'లో కొనసాగిన సహాయక చర్యలు

రాంబిల్లి, ఆగస్టు 22: అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా పరిశ్రమలో బుధవారం పెనుప్రమాదం జరిగి 17 మంది మృతి చెందగా, అధిక సంఖ్యలో కార్మికులు గాయాలపాలై పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కాగా శిథిలాల కింద ఇంకా ఎవరైనా ఉన్నారేమోననే ఉద్దేశంతో గురువారం కూడా గాలింపు చర్యలు చేపట్టారు. బాధిత కుటుంబాలు అధిక సంఖ్యలో కర్మాగారం వద్దకు చేరుకున్నాయి. వారిలో లోనికి అనుమతించకపోవడంతో గేటు వద్ద బైఠాయించారు. కాగా కలెక్టర్‌తో పాటు పలు శాఖల జిల్లా ఉన్నతాధికారులు కూడా సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదంపై ఆరా తీశారు. హోం మంత్రి అనితతో పాటు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టీడీపీ ఎలమంచిలి నియోజకవర్గం ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

కంపెనీ గేటు వద్ద బాధితుల పడిగాపులు

రాంబిల్లి, ఆగస్టు 22 : ఎసెన్షియా కంపెనీ గేటు వద్ద గురువారం బాధిత కుటుంబాలు పడిగాపులు కాశాయి. రాంబిల్లి మండలం సెజ్ కాలనీకి చెందిన యల్లబిల్లి చిన్నారావు ఎసెన్షియా కంపెనీలో ఎనిమిదేళ్లుగా పనిచేస్తున్నాడు. అతనికి భార్య లోవమ్మ, కుమారుడు శశాంక్, కుమార్తె కోమలి ఉన్నారు. బుధవారం జనరల్ షిఫ్టుకు వెళ్లిన తరువాత ప్రమాదం జరిగిన విషయం తెలుసుకొని కంపెనీ వద్దకు వెళ్లి అడిగితే చిన్నారావు గురించి చెప్పలేదని ఆయన బాబాయ్ శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఆస్పత్రులు తిరిగితే అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఉన్నాడని తెలిసి అక్కడికి వెళితే కేజీహెచ్‌కి తీసుకువెళ్లిపోయారని వాపోయారు.

నైపుణ్యంతో పని లేదా?

... 5వ పేజీ తరువాయి

చేయించడం వల్ల ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులతో వారాల తరబడి రాత్రులు నిద్ర లేకుండా పనులు చేయిస్తున్నారని, ఒక్కొక్క కాంట్రాక్టు కార్మికుడు 12 గంటల పాటు పనిచేస్తున్నారని సమాచారం. వీరికి కాంట్రాక్టర్ భోజన, వసతి సౌకర్యాలు కల్పించి నెలకు రూ.12 వేలు జీతం ఇస్తున్నారు. వసతి కూడా రేకుల షెడ్డుల్లో ఇస్తున్నారు. వీరికి సరైన విశ్రాంతి లేకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు అంటు న్నారు.

సరైన ఆస్పత్రి ఏది?

పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన అచ్యుతాపురంలో సరైన ఆస్పత్రి లేదు. ఇక్కడ సుమారు 450కి పైగా కర్మాగారాలు ఉన్నాయి. 30 వేల మందికి పైగా కార్మికులు, ఉద్యోగులు పనిచేస్తున్నారు. కానీ ఇక్కడ సరైన అస్పత్రి లేదు. అచ్యుతాపురం, హరిపాలెంలలో పీహెచ్‌సీలు మాత్రమే ఉన్నాయి. వీటిలో సరైన మందులు, సౌకర్యాలు, సిబ్బంది లేరు. సెజ్‌లో ఈఎస్ఐ ఆస్పత్రి కోసం గత వైసీపీ ప్రభుత్వం రెండెకరాలు స్థలం కేటాయించింది. అయితే ఐదేళ్ల పాలనతో కేవలం ప్రహరీ మాత్రమే నిర్మించింది. కూటమి ప్రభుత్వమైనా కర్మాగారాల్లో సరైన భద్రతా ప్రమాణాలు పాటించే చర్యలు తీసుకోవడంతో పాటు ఈఎస్ఐ ఆస్పత్రి నిర్మించాలని పలువురు కార్మికులు కోరుతున్నారు.



వ్యాక్సినేషన్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేశ్‌కుమార్ తదితరులు

1 నుంచి పశు గణన : కలెక్టర్

పాడేరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : వచ్చేనెల ఒకటో తేదీ నుంచి జిల్లాలో పశుగణన చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో గురువారం రాత్రి పశుగణన, గాలికుంటు వ్యాధి వ్యాక్సినేషన్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. 2030 నాటికి జిల్లాను గాలికుంటువ్యాధి రహితం చేయాలని, అందుకు అనుగుణంగా వ్యాక్సినేషన్ పక్కాగా జరగాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 5.95 లక్షల మూగజీవాలకు పక్కాగా వ్యాక్సినేషన్ చేయాలని, దూడలకు బ్రుసిల్లా టీకాలు చేయాలన్నారు. అలాగే సెప్టెంబరు నుంచి పశు గణన చేపట్టాలని, ప్రతి మారుమూల ప్రాంతాలను సందర్శించి గణన పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్.నరసింహులు, పశు వైద్యులు రాజీవ్‌కిరణ్, సుజన, డీపీఆర్‌వో పి.గోవిందరాజులు పాల్గొన్నారు.

బోధన ఉత్తమ ఫలితాలకు దోహదపడాలి : జడ్పీటీసీ



మరుగుదొడ్లు పరిశీలిస్తున్న జడ్పీటీసీ గంగరాజు, ఏటీడబ్ల్యూవో వెంకటరమణ

అనంతగిరి, ఆగస్టు 22 : విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు బోధన ఉండాలని జడ్పీటీసీ గంగరాజు అన్నారు. ఏటీడబ్ల్యూ కూడ వెంకటరమణతో కలి సి మండలకేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల-2 పాఠశాలను గురువారం తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థినులకు జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు వేశారు. ప్రతి అంశంలోనూ విద్యార్థులు అవగాహన కలిగి ఉండేలా బోధన సాగించాలని సూచించారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించారు. ఇక్కడ మరుగుదొడ్ల కొరత ఉందని, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళతానని గంగరాజు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కిల్లో బాలాజీ, హెచ్ఎం మంగమ్మ, మెట్రిన్ రాజ్యలక్ష్మి, నాగులు పాల్గొన్నారు.

డ్రాగన్ ఫ్రూట్స్ సాగుతో ఆర్థిక పరిపుష్టి

- రాష్ట్ర విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున్



లుంగాపుట్టులో డ్రాగన్ ఫ్రూట్ సాగును పరిశీలిస్తున్న మల్లికార్జున్

ముంచంగిపుట్టు, ఆగస్టు 22 : డ్రాగన్ ఫ్రూట్‌కు మార్కెట్‌లో మంచి గిరాకీ ఉందని ఆ సాగుపై గిరిరైతులు దృష్టి సారించాలని రాష్ట్ర విజిలెన్స్ డిప్యూటీ కమిషనర్ మల్లికార్జున్ అన్నారు. మండలంలో గల వనభసింగి పంచాయతీ కేంద్రంలో ఉపాధి హామీ పథకంలో హార్టికల్చర్ ద్వారా గిరిజన రైతులు పండిస్తున్న డ్రాగన్ ఫ్రూట్స్, సిల్వర్ ఓక్ ప్లాంటేషన్‌ను గురువారం ఆయన పరిశీలించారు. గిరి రైతులతో మాట్లాడి డ్రాగన్ ఫ్రూట్స్ సాగులో పాటిస్తున్న మెలుకువలపై ఆరా తీశారు. మరింతగా సాగు విస్తరణ పెంచాలని, ఉపాధి హామీ పథకం ద్వారా డ్రాగన్ ఫ్రూట్స్ సాగుకు పోత్సాహం అందిస్తామన్నారు. మండలంలో హార్టికల్చర్ ద్వారా ఈ ఏడాది సాగులో ఉన్న 2 లక్షల 80వేల డ్రాగన్ ఫ్రూట్స్ ప్లాంటేషన్‌ల స్థితిగతులపై ఆరా తీశారు. వాటికి సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కిరణ్‌కుమార్, ఏపీవో నాయుడు, ఉపాధి హామీ, హార్టికల్చర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

చింతపల్లి, ఆగస్టు 22 : ఈపీడీసీఎల్, జెన్‌కో కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విద్యుత్ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు బోనంగి చిన్నయ్య పడాల్ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఈపీడీసీఎల్ ఉప కేంద్రం వద్ద కార్మికులతో కలిసి సెప్టెంబరు 5న తలపెట్టిన ధర్నా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ ఈపీడీసీఎల్, జెన్‌కోలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 26 వేల మంది ఉద్యోగుల 30 ఏళ్లుగా పని చేస్తున్నారన్నారు. ప్రతి కార్మికుడుకి రెగ్యులర్ చేయాలన్నారు. 2022 పీఆర్సీ వేతనాల బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. పదవీవిరమణ రాయితీలు వర్తింపజేయాలన్నారు. కార్మికల సమస్యల సాధన కోసం తలపెట్టిన ధర్నాను విజయంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నేతలు సత్యనారాయణ, శివప్రసాద్ పాల్గొన్నారు.

గిరిజనులకు తప్పని డోలీమోత

- మహిళా రోగిని 6 కి.మీ. మోసుకొచ్చిన కుటుంబ సభ్యులు
- అక్కడ నుంచి ఆటోపై ఎస్.కోట ఆస్పత్రికి తరలింపు



రోగిని డోలీలో తరలిస్తున్న కుటుంబ సభ్యులు

అనంతగిరి, ఆగస్టు 22 : అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురైన గిరిజన మహిళను కుటుంబ సభ్యులు డోలీమోతపై ఆస్పత్రికి తరలించిన ఘటన గురువారం చోటుచేసుకుంది. మండలంలోని మారుమూల గుమ్మ పంచాయతీ కల్యాణగుమ్మి గ్రామానికి చెందిన మామిడి రంభ(39) మలేరియా జ్వరంతో తీవ్ర అస్వస్థకు లోనైంది. గ్రామానికి సరైనా రహదారి సౌకర్యం లేకపోవడంతో వాహనం వచ్చే పరిస్థితి లేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమెను డోలీపై సుమారు 6 కిలోమీటర్లు మోసుకుంటూ సమిధ వరకు తీసుకువచ్చి, అక్కడ నుంచి ఆటోలో ఎస్.కోట ఆస్పత్రికి తరలించారు. అధికారులు స్పందించి తమ గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని కల్యాణగుమ్మి గ్రామస్థులు కోరుతున్నారు.

గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



క్రీడాకారులతో కరచాలనం చేస్తున్న ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి, ఆగస్టు 22 : గిరిజన విద్యార్థులు క్రీడల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయభారతి అన్నారు. ఈ నెల 29న క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని డిగ్రీ కళాశాల అధ్యాపకులు క్రీడా పోటీలు ఏర్పాటు చేశారు. ఈ పోటీలకు వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించే ఉద్దేశంతో ఈ పోటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు ధ్రువప్రత్రాలు, బహుమతులు అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లీలాపావని, గ్రంథాలయాధికారి జగ్గత్‌రాయ్ పాల్గొన్నారు.

ట్యాబ్‌ల వినియోగంతో విద్యా ప్రమాణాల మెరుగు : డీఈవో

- డీఈవో బ్రహ్మాజీరావు



ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలిస్తున్న డీఈవో

పెదబయలు, ఆగస్టు 22 : ట్యాబ్‌ల వినియోగంతో విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని అల్లూరి జిల్లా విద్యాధికారి పి.బ్రహ్మాజీరావు అన్నారు. గురువారం మండలంలో పలు పాఠశాలను ఆయన సందర్శించారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో పాఠశాల రికార్డులను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న సీబీఎస్ఈ పరీక్షల తీరును పరిశీలించారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ ట్యాబ్‌ల ద్వారా పరీక్షలు రాయడం వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత, పాఠ్యాంశాలపై పట్టు పెంపొందుతుందన్నారు. ఆన్‌లైన్ విధానంపై అవగాహన ఏర్పడుతుందన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలన్నారు. పాఠ్య, నోటు పుస్తకాలు సకాలంలో పరిశీలిస్తుండాలని సూచించారు. అనంతరం జడ్పీ హైస్కూలులో నిర్వహిస్తున్న పెదబయలు,ముంచంగిపుట్టు మండలాలకు చెందిన పీఈటీ, పీడీల ఒక్కరోజు శిక్షణ తరగతులను పరిశీలించారు. ఆరుగురు టీచర్లు గైర్హాజరు కావడంపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో సీఎంవో కె.భాస్కరరావు (సమగ్ర శిక్ష), ఐటీ సెల్ ఇన్‌చార్జీ కామరాజు, ఎంఈవో, కాంప్లెక్స్ ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటిస్తేనే 'హర్ ఘర్ జల్' గ్రామ ధ్రువీకరణ



ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఐపీఎస్‌వోఎస్ బృందం ప్రతినిధులు



డయేరియా నివారణపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కొయ్యూరు, ఆగస్టు 22 : జల్ జీవన్ మిషన్ పనులను పరిశీలించి, నిబంధనల మేరకు పని తీరు ఉన్నట్టు నిర్ధారణకు వచ్చిన తర్వాతే హర్ ఘర్‌జల్ గ్రామంగా ధ్రువీకరించనున్నట్టు జేజేఎం డీపీఎంయూ జిల్లా కో-ఆర్డినేటర్ పి.పుల్లయ్య స్పష్టం చేశారు. గురువారం మండలంలో జల్‌జీవన్ మిషన్ పథకం అమలు చేసిన బట్టపణుకుల గ్రామాన్ని ఫంక్షనాలిటీ ఆఫ్ అసెస్‌మెంట్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పథకం ఫీల్డ్ అసెట్స్, సోర్స్ పాయింట్లు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకులతో పాటు పథకంలో ఇంటింటా కొళాయి ఏర్పాటుపై 12 నివాస గృహాలు, ప్రభుత్వ పాఠశాలను సందర్శించి పథకం అమలు తీరుపై సంతృప్తి వ్యక్తంచేశారు. ఎఫ్‌టీకే మహిళా సభ్యుల కార్యక్రమాలను, గ్రామ నీరు పారిశుధ్య కమిటీ ఏర్పాటు సభ్యుల వివరాలను తనిఖీ చేశారు. గ్రామస్తులతో సమావేశం నిర్వహించి హర్ ఘర్ జల్ గ్రామం ధ్రువీకరణ పత్రాన్ని సర్పంచ్‌కు అందచేశారు. అనంతరం నడింపాలెం గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను సందర్శించి స్టాఫ్ డయేరియా కార్యక్రమంలో భాగంగా డయేరియా నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ విశ్వతేజ, జేజేఎం డీపీఎం రాజేష్, జిల్లా కో-ఆర్డినేటర్ ఆనంద్, ఐపీఎస్‌వోఎస్ సర్వే బృందం సభ్యులు రహంతుల్లా, సర్పంచ్ బాలకృష్ణ పంచాయతీ కార్యదర్శి ప్రసన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ వర్కర్లు, పంప్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

'వయ్యారి భామ'ను దూరంగా ఉంచుదాం

- ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి



చుంచుంపూడిలో గిరిజనులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు

చింతపల్లి, ఆగస్టు 22 : వయ్యారి భామ కలుపు మొక్క వల్ల ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి అన్నారు. గురువారం వయ్యారి భామ నిర్మూలన వారోత్సవంలో భాగంగా శాస్త్రవేత్తలు, అగ్రికల్చర్ పాలిటెక్నిక్ విద్యార్థులు గిరిజనులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చుంచుంపూడి గ్రామంలో వయ్యారి భామ కలుపు మొక్క వల్ల కలిగే నష్టాలపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీఆర్ మాట్లాడుతూ వయ్యారి భామ మొక్క పలు చోట్ల తెల్లని పుష్పాలతో కనిపిస్తుందన్నారు. పంట పొలాలు, గృహ పరిసరాల్లో ఏపుగా ఈ మొక్కలు పెరుగుతాయన్నారు. ఈమొక్కల వల్ల ప్రధానంగా మానవుల్లో శ్వాసకోస సంబంధ రోగాలు కలుగుతాయన్నారు. అలాగే తామర, చర్మవ్యాధులు, జ్వరాలు, ఉబ్బసం వ్యాధులు కలుగుతాయన్నారు. పశువుల్లో ఊపిరితిత్తుల వ్యాధులు, తీవ్ర జ్వరం, పాల ఉత్పత్తి, బరువు తగ్గడం జరుగుతుందన్నారు. ఈ మొక్కలు గృహపరిసరాలు, పంట పొలాల్లో ఉంటే వెంటనే వేర్లతో తొలగించుకోవాలన్నారు. ఈ మొక్కలను గుంతలో వేసి కొన్ని రోజుల తరువాత ఎరువుగా ఉపయోగించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ కె.బయ్యపురెడ్డి, డాక్టర్ పి.బాలహంస్సేన్ రెడ్డి, డాక్టర్ సీదరి ఉజ్వలరాణి, పాలిటెక్నికల్ ఉద్యోగులు కె.బాబుజీ నాయుడు, ఎస్.శ్వేత, అన్నపూర్ణ, ఆర్.ప్రవీణ్ పాల్గొన్నారు.

విస్తృతంగా దోమల నివారణ మందు పిచికారీ



దోమల నివారణ మందు స్ప్రే చేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి, ఆగస్టు 22 : ప్రతి గృహానికి దోమల మందు పిచికారీ చేయాలని స్థానిక అసిస్టెంట్ మలేరియా అధికారి సత్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని అసరాడ గ్రామంలో జరుగుతున్న రెండో విడత దోమల మందు పిచికారీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏఎంవో మాట్లాడుతూ మలేరియా, డెంగ్యూ జ్వరాలు కలిగించే దోమలను నియంత్రించేందుకు దోమల మందు పిచికారీ చేయడం జరుగుతుందన్నారు. కొంతమంది గిరిజనులు దోమల మందు దుర్వాసన వస్తోందంటూ గృహంలో లోపల పిచికారీ చేయించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం ఏసీఎం 5 శాతం మందు పిచికారీ చేస్తున్నారన్నారు. ఈ మందు వాసన గాని, రంగు గాని ఉండదని, కేవలం దోమలపై మాత్రమే ప్రభావం చూపుతుందన్నారు. గృహం లోపల, బయట దోమల మందు పిచికారీ చేయడం వల్ల దోమలు చనిపోతాయన్నారు. అలాగే గిరిజనులు దోమ తెరలను వినియోగించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలన్నారు. గృహ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కడా నిలువ నీరు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారి కన్నబాబు, సూపర్‌వైజర్లు శ్రావణి, సంధ్య, కూటమి నాయకుడు రంగారావు పాల్గొన్నారు.

గంజాయి నిర్మూలనపై అవగాహన ర్యాలీలు



అరకులో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

అరకులోయ, ఆగస్టు 22 : 'గంజాయికి దూరంగా ఉందాం - భవిష్యత్‌ను కాపాడుకుందాం' అంటూ అరకులోయ పోలీసులు విద్యార్థులతో కలిసి పరివర్తన పేరుతో అవగాహన ర్యాలీ చేపట్టారు. గురువారం అరకులోయ ఎస్ఐ ఆర్.సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థులతో చేపట్టి గంజాయి వల్లే ఎదురయ్యే అనర్థాలపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఎస్ఐ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ గంజాయి పండించడం, రవాణా చేయడం తీవ్ర నేరం అన్నారు. ఇలాంటి వాటికి ప్రోత్సాహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందుకే గిరిజనులు, యువత గంజాయికి దూరంగా మెలగాలని సూచించారు.

పెదబయలు : మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలని పెదబయలు మండల ఇన్‌చార్జ్ ఎస్ఐ కుమార్ బాబు అన్నారు. మండల కేంద్రంలో వివిధ పాఠశాలల విద్యార్థులతో గంజాయి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్, సెయింట్ ఆన్స్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

జి.మాడుగుల : గంజాయి సాగు, రవాణాకు దూరంగా ఉండాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గౌరీ శంకర్, పోలీసులు ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. గంజాయి సాగు, రవాణా, విక్రయాలు చేపడితే తమకు సమాచారం అందించాలని పోలీసులు తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అలాగే పారితోషికం కూడా అందజేస్తామని తెలిపారు.

ముంచంగిపుట్టు : గంజాయినిర్మూలనకు అన్ని వర్గాల వారు తమవంతు సహకారం అందించాలని ఎస్ఐ కె.రవీంద్ర అన్నారు. మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో కమ్యూనిటీ బిల్డింగ్ ఎక్సర్‌సైజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన సర్పంచులు, ఆటో యూనియన్ సభ్యులు, వ్యాపారస్తులు తదితరుల సాధక బాధలను ఎస్ఐ అడిగి తెలుసుకున్నారు. మాదక ద్రవ్యాల వల్ల కుటుంబాలు రోడ్డున పడతాయన్నారు.

'కుడుముసారి' అటవీ భూములపై విచారణ



గిరిజనులను విచారిస్తున్న ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి గౌతమి కుమారి

చింతపల్లి, ఆగస్టు 22 : మండలంలోని కుడుముసారి పంచాయతీ పరిధిలో గిరిజనుల సాగులో ఉన్న అటవీ భూములపై ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి సీహెచ్ గౌతమికుమారి విచారణ చేపట్టారు. పంచాయతీ పరిధిలోనున్న 16 మంది గిరిజనులు తమ సాగులోనున్న అటవీ భూములకు పట్టాలు మంజూరు చేయాలని, తమకు పట్టాలు పంపిణీ చేసేందుకు అటవీశాఖ అభ్యంతరం వ్యక్తం చేస్తోందని హైకోర్టును ఆశ్రయించారు. ఈ భూవివాదంపై విచారణ చేపట్టి నివేదిక ఇవ్వాలని ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారిని హైకోర్టు కోరింది. ఈ మేరకు గురువారం చింతపల్లి వచ్చిన సెటిల్‌మెంట్ అధికారి అటవీ భూములను సాగు చేస్తున్న గిరిజనులను విచారించారు. గిరిజనులు, అటవీశాఖ ఉద్యోగుల అభిప్రాయాలను ఆమె తీసుకున్నారు. ఈ నివేదికను సెటిల్‌మెంట్ అధికారి న్యాయస్థానానికి అందజేయనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ టి.రామకృష్ణ పాల్గొన్నారు.

ఆహార నాణ్యత పరిశీలన



ఆహార నాణ్యతను పరిశీలిస్తున్న పోలీసు సిబ్బంది

డుంబ్రిగుడ, ఆగస్టు 22 : కోటపుఠట్ల అనాథాశ్రమంలో కలుషిత ఆహారం తిని ముగ్గురు విద్యార్థులు మృతి చెందడం, పలువురు అస్వస్థలకు గురైన ఉదంతంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఇందులో భాగంగా ఆశ్రమ ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో అమలవుతున్న పోషకాహారంపై విద్య, రెవెన్యూ, ఆరోగ్య, పోలీసు యంత్రాంగం దృష్టి సారించింది. మండలంలోని కిలోగుడ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బందితో పాటు పోలీసులు మధ్యాహ్నం భోజన మెనూను పరిశీలించారు. వంటగది, కూరగాయలు భద్రపరిచే గదుల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామ సభను విజయవంతం చేయాలి

సీలేరు, ఆగస్టు 22 : మేజర్ పంచాయతీ ప్రజలు గ్రామ సభను విజయవంతం చేయాలని స్థానిక పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయతీరాజ్ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఉదయం 11గంటలకు సర్పంచ్ దుర్గో అధ్యక్షతన గ్రామ సభ నిర్వహిస్తామని, ఈ సభకు వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, ప్రజలు హాజరు కావాలన్నారు.

జీసీసీ బంక్‌లో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ విక్రయం



వినియోగదారుల పెట్రోల్ నాణ్యతపై అవగాహన కల్పిస్తున్న సూపరింటెండెంట్ రామకృష్ణ

చింతపల్లి, ఆగస్టు 22 : గిరిజన సహకార సంస్థ పెట్రోల్ బంకుల్లో నాణ్యమైన పెట్రోల్, డీజిల్ విక్రయిస్తున్నట్టు సూపరింటెండెంట్ బి.రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం స్థానిక జీసీసీ పెట్రోల్ బంకులో వినియోగదారులకు నాణ్యత పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ చింతపల్లి జీసీసీ పెట్రోల్ బంకులో నీళ్ల కలిసిన పెట్రోల్ విక్రయిస్తున్నారని ఓ వ్యక్తి సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ పెట్రోల్ బంకు ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు సోషల్ మీడియాలో ప్రచారం చేసిన వ్యక్తిపై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. బంకులో ప్రతి రోజు నాణ్యత పరీక్షలు నిర్వహిస్తామన్నారు. డెన్సిటీ, ఫిల్టర్ పేపర్, వాటర్ పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ పరీక్షల్లో డెన్సిటీ ఉంటేనే విక్రయాలు నిర్వహిస్తామన్నారు. జీసీసీ బంకు ట్యాంకర్లలో వర్షపు నీరు చేరే అవకాశం లేదన్నారు. దీనికి బంకు నిర్మాణంలోనే ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. జీసీసీ బంకులో విక్రయిస్తున్న పెట్రోల్ నాణ్యతపై ఇన్‌చార్జ్ వద్దకు వచ్చి డెన్సిటీ, ఫిల్టర్ పేపర్, వాటర్ పరీక్షలు ఎప్పుడైనా చేయించవచ్చన్నారు. గిరిజన సహకార సంస్థ ప్రజలకు కచ్చితమైన ధరకు నాణ్యమైన పెట్రోల్ అందించాలనే లక్ష్యంతో బంక్‌లను నిర్వహిస్తోందన్నారు. గిరిజన ప్రాంత ప్రజలు జీసీసీ పెట్రోల్ బంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మాతృభాషలో విద్యార్థులు పట్టు సాధించాలి

చింతపల్లి, ఆగస్టు 22 : మాతృభాష తెలుగులో విద్యార్థులు పట్టు సాధించాలని స్థానిక ఏపీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామేశ్వరం అన్నారు. ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తెగులు భాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో విద్యార్థుల్లో తెలుగు భాషా నైపుణ్యాలు పెంపొందించేందుకు ఈ పోటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ పోటీల్లో వ్యాసరచన, వక్తృత్వం పోటీల్లో సీనియర్స్, జూనియర్, సబ్ జూనియర్స్ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విభాగాల్లో ముగ్గురు విద్యార్థులను ఎంపిక చేశామన్నారు.

ఇసుక అక్రమాలపై క్రిమినల్ చర్యలు

... 5వ పేజీ తరువాయి

వస్తుందన్నారు. అప్పటి వరకు ప్రస్తుత విధానం కొనసాగుతుందన్నారు. జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ మాట్లాడుతూ.. ఇసుక పాయింట్ల వద్ద పోలీసు చెక్‌పోస్ట్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. చలానా లేకుండా ఇసుక రీచ్‌లకు వెళ్లకూడదని, ఉచిత ఇసుక సరఫరాలో అక్రమాలకు పాల్పడితే అందుకు బాధ్యులపై చర్యలు చేపడతామన్నారు. స్థానిక అవసరాల మేరకు నాణ్యమైన ఇసుకను సరఫరా చేయడానికి ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందన్నారు. ఉచిత ఇసుక రవాణా ఛార్జీలపై ప్రజలకు అవగాహన కలిగి ఉండాలని ఎస్పీ అమిత్ బర్దార్ అన్నారు.

సంక్షిప్తంగా..

నేడు ఐటీడీఏలో 'మీ కోసం'

పాడేరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీ కోసం కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో నిర్వహిస్తామని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మీకోసం కార్యక్రమం రద్దయ్యింది. ఈవారం నిర్వహించే మీ కోసం కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కలెకర్ సూచించారు.

నేడు పంచాయతీ కేంద్రాల్లో గ్రామసభలు

పాడేరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సూచనల మేరకు శుక్రవారం జిల్లాలోని ప్రతి పంచాయతీ కేంద్రంలో గ్రామసభలు నిర్వహించనున్నారు. స్థానిక సంస్థలు, పంచాయతీరాజ్‌వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా ఆగస్టు 23న ప్రతి పంచాయతీలో విధిగా గ్రామసభలను నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశించారు. పంచాయతీ స్థాయిలో గ్రామసభలను ఏర్పాటు చేస్తున్నారు.

జి.మాడుగుల ఎంపీపీగా కల్యాణి



జి.మాడుగుల, ఆగస్టు 22 : మండల పరిషత్ అధ్యక్షురాలుగా వంతాల కల్యాణి నియమితులయ్యారు. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఇక్కడి ఎంపీపీగా కొనసాగిన కొర్రా పద్మ ఇటీవలే రాజీనామా చేసిన విషయం తెలిసిందే. దీంతో వైస్ ఎంపీపీ వంతాల కల్యాణిని ఎంపీపీగా అధికారులు నియమించారు. ఈ మేరకు ఎంపీడీవో కార్యాలయ ఏవో ఆమెకు నియమక పత్రాన్ని అందజేశారు. ఈమె వంతాల సెగ్మెంట్ నుంచి ఎంపీటీసీ సభ్యులుగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కాగా తదుపరి ఎన్నికలు నిర్వహించే వరకు ఎంపీపీగా కల్యాణి కొనసాగనున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఎస్టీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు వి.కొండలరావు, నాయకులు కేవీ.సురేశ్‌కుమార్, ఎల్. అప్పలరాజు, కె.కల్యాణం, శాంతికుమారి, పి.భీంబాబు పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి 1100 క్యూసెక్కుల నీరు విడుదల

సీలేరు, ఆగస్టు 22 : డొంకరాయి జలాశయం ఆరో నంబరు గేట్ నుంచి 1100 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్టు ఈఈ విజయ్ కుమార్ తెలిపారు. ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పరిసర ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల వల్ల జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతుందన్నారు. జలాశయం నీటి మట్టం 1037 అడుగులు కాగా, గురువారం నాటికి 1036.2 అడుగులు ఉందన్నారు. జలాశయానికి ఇన్‌ఫ్లో 4600 నుంచి 5000 క్యూసెక్కుల వరకు వరద నీరు చేరుకుందన్నారు. ఈ నీరుని గేట్లు ద్వారా 1100 క్యుసెక్కులు, పవర్ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామన్నారు. సీలేరు, డొంకరాయి, పొల్లూరు విద్యుత్ కేంద్రాల్లో గ్రిడ్ ఆదేశాల మేరకు విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందన్నారు

28న నేత్ర వైద్య శిబిరాలు

పాడేరు, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి) : డివిజన్‌లోని మినుములూరు, హుకుంపేట పీహెచ్‌సీల్లో ఈ నెల 28న శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరాలను నిర్వహిస్తారని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రాజెక్టు మేనేజర్ డాక్టర్ టి.విశ్వేశ్వనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాడేరు, హుకుంపేట మంలాలకు చెందిన నేత్ర సంబంధ సమస్యలున్న వ్యక్తులు ఆయా నేత్ర వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే నేత్ర వైద్యశిబిరానికి విచ్చేసే వ్యక్తులు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డులు విధిగా తీసుకురావాలన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

అరకులోయ, ఆగస్టు 22 : స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో చేరేందుకు రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రామకృష్ణ తెలిపారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. ఈ నెల 23 వరకు రిజిస్ట్రేషన్లు, 25 వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చేందుకు గడువు తేదీలుగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధ్యాయుడి నియామకానికి వినతి

అనంతగిరి, ఆగస్టు 22 : మండలంలోని నిమ్మలపాడు జీపీఎస్‌టీడబ్ల్యూ పాఠశాలలో ఉపాధ్యాయుడిని నియమించాలని, గ్రామస్థులు జడ్పీటీసీ గంగరాజుతో కలిసి ఎంఈవో కిల్లో బాలాజీకి గురువారం వినతి పత్రం అందజేశారు. పాఠశాల పునఃప్రారంభం నుంచి ఉపాధ్యాయుడు లేకపోవడంతో పాఠశాల తెరుచుకోలేదని, సుమారు 72 మంది వరకు విద్యార్థులు పాఠశాలలోని విద్యాభ్యాసం చేస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై వెంటనే స్పందించిన ఎంఈవో వాలసీ ఎంపీయూపీ పాఠశాలను నుంచి ఒక ఉపాధ్యాయుడిని నియమించారు. ఆ ఉపాధ్యాయులు శుక్రవారం నుంచి విధులకు హాజరవుతారని గ్రామస్థులు తెలిపారు.

టీచర్ల కొరతపై డీఈవోకు నివేదిక

అనంతగిరి, ఆగస్టు 22 :మండలంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు కొరతపై జిల్లా విద్యాశాఖాధికారికి నివేదికను అందించినట్టు ఎంఈవో కిల్లో బాలాజీ గురువారం తెలిపారు. పదవీవిరమణ, పదోన్నతులు, ఉన్నత విద్యాభ్యాసం నిమిత్తం కొందరు ఉపాధ్యాయులు వెళ్లడం వంటి కారణాలతో కొరత ఏర్పడిందన్నారు. కాకరపాడు, నిమ్మలపాడు, వేంగడ, గూడెం, గాదిల్లోవ, గాలిపాడు, పెదరాభ, కితలంగి, కమలపురం, శకుంపర్తి, రొంపల్లి పాఠశాలలకు ఉపాధ్యాయుల కొరతపై నివేదించారు.

సీఐ అశోక్‌కుమార్‌కు సన్మానం



సీఐ దంపతులను సన్మానిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 22 : బదిలీపై విజయనగరం వెళుతున్న జీకే వీధి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ అశోక్‌కుమార్‌ను స్థానిక ప్రజలు, సచివాలయం మహిళా కానిస్టేబుళ్లు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మహిళా కానిస్టేబుళ్లు మాట్లాడుతూ మూడున్నరేళ్ల పాటు పాటు జీకేవీధి సీఐగా పని చేసిన అశోక్‌కుమార్ తన సేవలతో ఆదివాసీ మన్ననలు అందుకున్నారన్నారు. ఆయన సేవలు ఎన్నడూ మర్చిపోలేమన్నారు.